PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 342 పేజీలు - 08 గురువారం 05 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నిన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



తెలంగాణకు 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం!

డీప్‌టెక్ రంగంలో ప్రపంచస్థాయి కేంద్రంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం.. పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెరగాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయలో బుధవారం నిర్వహించిన ఫిక్కీ శతాబ్ది వేడుకలు, తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.రాష్ట్రంలో ఐటీ, ఔషధాలు, జీవసాంకేతికత, మిగతా2లో...

బాల కార్మిక వ్యవస్థకు చెక్..

చట్టం అమలుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు!

పర్యవేక్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి సూచన.. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు చర్యలు



వరద సహాయక చర్యల్లో విషాదం..

11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గల్లంతు!

మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లి బేతపల్లి చెరువు అలుగు వద్ద బోట్లు బోల్తా



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతపల్లి పెద్ద చెరువు వద్ద బుధవారం విషాదం చోటుచేసు కుంది. వరదలో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన 11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రెండు బోట్లు బోల్తా పడటంతో తమ్మిలేరు వాగులో గల్లంతయ్యారు.చెరువు అలుగు వద్ద ఏడుగురు మత్స్యకారులు వరద ఉధృతికి చిక్కుకోగా, వారిని కాపాడేందుకు సిబ్బంది రంగంలోకి దిగారు. గల్లంతైన వారి కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. కలెక్టర్ దివాకర టీఎస్ మిగతా2లో...

తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్!

- దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు కేంద్రం కూడా తెలంగాణ కులగణనను ప్రామాణికంగా తీసుకుంది

హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర మరువలేనిది

శ్రీకృష్ణ సదర్ ఉత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలి: బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్






తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ కులగణనను ప్రామాణికంగా తీసుకుందని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. మిగతా2లో...

ట్రంప్ ఓటమిపై ప్రపంచ దేశాల స్పందన!

ఇరాన్ హర్షం.. రష్యా ఆచితూచి వ్యాఖ్యలు.. అమెరికాతో సంబంధాలు కొనసాగిస్తామన్న చైనా





పరీక్షల సంస్కరణలపై నందన్ నీలేకనితో చంద్రబాబు చర్చలు

పేపర్ లీకేజీల నివారణకు సాంకేతికత వినియోగంపై దృష్టి

ఢిల్లీ పార్టీలతో తెలంగాణకు న్యాయం జరగదు!

- తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నాయకత్వాల ముందు తాకట్టు పెడుతున్నారు
- రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే కాంగ్రెస్, బీజేపీల ప్రాధాన్యం
- రేవంత్‌రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి.. కేటీఆర్ విమర్శలు



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: ఢిల్లీ పార్టీలతో తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరగబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నాయకత్వాల ముందు కాంగ్రెస్, బీజేపీలు తాకట్టు పెడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ సంచులు మోస్తే.. బీజేపీ చెప్పులు మోస్తోందని ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబా ద్‌లోని తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు అవుకు దామోదర్‌రెడ్డి మిగతా2లో...

క్రమశిక్షణ ఉల్లంఘనపై కాంగ్రెస్ అధిష్టానం గుర్రు!

ఢిల్లీ నిరసన సభకు గైర్హాజరైన నేతలపై ఆగ్రహం.. తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై వివరణ కోరిన ఏఐసీసీ

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: ఢిల్లీలో నిర్వహించిన ఓట్ చోరీ వ్యతిరేక నిరసన సభకు గైర్హాజరైన తెలంగాణ కాంగ్రెస్ నేతల వ్యవహారంపై ఏఐసీసీ తీవ్రంగా స్పందించింది. అధిష్టానం ఆదేశించిన కార్యక్రమానికి హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ అంశంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆదేశించింది. ఈ నెల 1న ఢిల్లీలోని మిగతా2లో...

తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాదవులను అన్ని విధాలుగా గౌరవిస్తోందని తెలిపారు. **హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకం** హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర వెలకట్టలేనిదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించామని గుర్తుచేశారు. ప్రస్తుతం గోల్కొండ కోట ఉన్న ప్రాంతం ఒకప్పుడు గొల్లం కొండగా ప్రసిద్ధి చెందిందని ప్రస్తావించారు. వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రజలను యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని చెప్పారు. నగర అభివృద్ధిలో వారి సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. **సదర్ ఉత్సవాలకు రూ.5 కోట్ల కేటాయింపు**సదర్ వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు కేటాయించిందని సీఎం వెల్లడించారు. మూసీ పునరుద్ధరణ, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు యాదవ సోదరులు సహకరించాలని కోరారు. **పశుసంపదతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ పశుసంపద అభివృద్ధి ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని అన్నారు. సదర్ ఉత్సవాల ద్వారా యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి పరిచయమవుతున్నాయని పేర్కొన్నారు. యాదవులు ఆర్థిక వ్యవస్థలో మరింత భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. **జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి**బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ దేశంలోని అన్ని సామాజిక వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సామాజిక న్యాయం సాధించేందుకు జనాభా గణాంకాలు కీలకమని పేర్కొన్నారు.మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ సదర్ వేడుకలు సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. అంతరించిపోతున్న ఆచారాలు, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడమే సదర్ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవులు భారీగా తరలివచ్చారు. సదర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దున్నరాజుల ప్రదర్శనలు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు వి.హన్మంతరావు, మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు.

ఢిల్లీ పార్టీలతో తెలంగాణకు న్యాయం జరగదు!

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.రాష్ట్ర ప్రయోజనాల కంటే కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టడంతో ఆయనకు ఢిల్లీలో ఉన్న గౌరవం ఏమిటో అర్థమైందని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి అని విమర్శించారు. ఢిల్లీ పర్యటనలతోనే పాలన సాగిస్తున్నారని ఆరోపించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కంటే చిన్నవాడైన అమిత్‌షా కాళ్లకు నమస్కరించాల్సిన పరిస్థితి రావడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని దిగజార్చడమేనని అన్నారు. అమిత్‌షా పర్యటన సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ బౌన్సర్‌లా వ్యవహరించారని విమర్శించారు. అమిత్‌షా తెలంగాణకు ఉత్త చేతులతో వచ్చి వెళ్లారని, రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా జాతీయ స్థాయి విద్యాసంస్థను తీసుకురాలేదని ప్రశ్నించారు.**ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం**కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టిందని, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై పగబట్టిందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. హైదరాబాద్‌లో మళ్లీ తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ హయాంలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని గుర్తుచేస్తూ.. రేవంత్‌రెడ్డి ఒక్క ఇందిరమ్మ ఇల్లయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. ఎన్నికల హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కేసీఆర్‌పై విమర్శలు చేయడం తప్ప పాలనపై సీఎం దృష్టి పెట్టడం లేదన్నారు.**మియాపూర్ భూముల విక్రయంపై ప్రశ్నలు** మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూముల విక్రయంపై రాష్ట్ర ప్రభుత్వానికి అంత తొందర ఎందుకని కేటీఆర్ ప్రశ్నించారు. తీర్పు వచ్చిన 24 గంటల్లోనే భూములు అమ్మేస్తామని సీఎం ప్రకటించడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు. వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కమీషన్ల కోసం విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మియాపూర్ భూముల్లో ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, హైదరాబాద్‌లోని పేదలకు స్థలాలు కేటాయించాలని కోరారు. హిల్ట్ పాలసీ పేరుతో కమీషన్ల వ్యవహారానికి తెరలేపారని, పరిశ్రమల కోసం కేటాయించిన విలువైన భూములను ప్రైవేటు ప్రయోజనాల కోసం విక్రయించడం దారుణమని విమర్శించారు.**విద్యుత్ కోతలతో ప్రజలకు ఇబ్బందులు** కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేదని, జనరేటర్లు, ఇన్వర్టర్ల అవసరం తగ్గిపోయిందని కేటీఆర్ అన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌పై కేబినెట్ దృష్టి!

నేడు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం

పెట్టుబడులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: తెలంగాణ మంత్రిమండలి సమావేశం గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. అంతకుముందు మధ్యాహ్నం 3 గంటలకు మంత్రుల తో సీఎం అనధికారికంగా సమావేశం కానున్నారు. ప్రధానంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లు, రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చించనున్నట్లు సమాచారం. వివిధ రంగాల్లో పెట్టుబడి ప్రతిపాదనలు, పరిశ్రమలకు భూకేటాయిం పులు, కొత్త ప్రాజెక్టులకు అనుమతుల అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయంపై ప్రభావం, తాగునీరు, విద్యుత్ సరఫరా సమస్యలపైనా మంత్రిమండలి సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. రైతుల ఇబ్బందులు, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగ నియామకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించే అవకాశం ఉంది.వివిధ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలు, పరిపాలనాపరమైన అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకోనుంది. సమావేశంలో వెలువడే నిర్ణయాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

కొడంగల్‌లో రైతు పండుగ.. మూడు రోజుల పాటు


మెగా రైతు మేళా!

- **నవంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహణ.. 150 ప్రదర్శన స్టాళ్లు..**

చివరి రోజు 50 వేల మంది రైతుల హాజరు



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు అధిక ఆదాయం ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలను పరిచయం చేసేందుకు కొడంగల్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు మెగా రైతు మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. నవంబర్ 7న ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేళాను ప్రారంభించనున్నారు.**150 ప్రదర్శన స్టాళ్ల ఏర్పాటు** మేళాలో 26 ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో సుమారు 150 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, నూతన వ్యవసాయ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించనున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు.**ఎల్‌నినో ప్రభావంపై అవగాహన** ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయంపై వాటి ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక చర్చలు జరగనున్నాయి. మొదటి రోజు సుమారు 7,500 మంది రైతులు పాల్గొననున్నారు. రైతులకు వ్యవసాయ యంత్రాలు, కస్టమ్ హైరింగ్ కేంద్రాలు, పప్పుధాన్యాల మిల్లులు, నూనె గానుగ యూనిట్లు, డ్రిప్ పరికరాలు అందించనున్నారు.రెండో రోజు మహిళా రైతులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజు పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరవుతారని అంచనా. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.



రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే!

- వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో వచ్చే ఏడాదిలోగా సమగ్ర భూ సర్వే పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.భూముల రీ సర్వేను రైతుల సమక్షంలోనే పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. భూమి హద్దులు, విస్తీర్ణంలో తేడాలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రతి భూ యజమానికి పక్కా వివరాలతో కూడిన భూ రికార్డులు, కొత్త పాస్‌బుక్కులు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.సర్వే జరిగే గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు వారానికోసారి క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

బాల కార్మిక వ్యవస్థకు చెక్..

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: బాల కార్మికుల నిషేధ చట్టం అమలును మరింత కఠినతరం చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బాల కార్మికుల (నిషేధం, నియంత్రణ) సవరణ చట్టం2016 అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు సంస్థలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు సూచించింది.జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 14 ఏళ్లలోపు పిల్లలను అన్ని రకాల వృత్తులు, పనుల్లో నియమించడాన్ని నిషేధించే ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొంది.

2009 నాటి పిటిషన్‌పై విచారణ బాల కార్మికుల చట్టంలోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ 'హెల్ప్ ఫర్ మిలియన్స్' అనే స్వచ్ఛంద సంస్థ 2009లో పిటిషన్ దాఖలు చేసింది. పిల్లలకు విద్యా సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజనం కల్పించాలని కూడా కోరింది. 2016లో చట్ట సవరణతో పిటిషనర్ లేవనెత్తిన అంశాలు పరిష్కారమయ్యాయని కేంద్రం కోర్టుకు తెలిపింది. దీంతో పిటిషన్‌పై తదుపరి విచారణ అవసరం లేదని పేర్కొన్న ధర్మాసనం, సవరించిన చట్ట నిబంధనలను మాత్రం కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది.

వరద సహాయక చర్యల్లో విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.**సహాయక చర్యలపై సీఎం ఆరా** ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. గల్లంతైన సిబ్బందిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సూచించారు.

ట్రంప్ ఓటమిపై ప్రపంచ దేశాల స్పందన!

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ల ఓటమిపై ప్రపంచ దేశాల నేతలు స్పందించారు. డెమోక్రాట్లు విజయం సాధించడాన్ని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ స్వాగతించారు. ట్రంప్ విధానాలకు అమెరికా ప్రజలు వ్యతిరేకంగా తీర్పునిచ్చారని వ్యాఖ్యానించారు.అమెరికా ఓటర్లు యుద్ధాన్ని తిరస్కరించారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘర్ గాలిబఫ్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ ఫలితాలతో అమెరికా విదేశాంగ విధానంలో తక్షణ మార్పులు వస్తాయని భావించలేమని రష్యా తెలిపింది.డెమోక్రాట్ల విజయం ఉక్రెయిన్‌కు మద్దతు, పర్యావరణ పరిరక్షణకు మేలు చేయవచ్చని యూరోపియన్ యూనియన్ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా ఎన్నికలు ఆ దేశ అంతర్గత వ్యవహారమని చైనా పేర్కొంది. జపాన్, బ్రిటన్ కూడా అమెరికాతో తమ సంబంధాలు కొనసాగుతాయని స్పష్టం చేశాయి.

పరీక్షల సంస్కరణలపై నందన్ నీలేకనితో చంద్రబాబు చర్చలు

- పేపర్ లీకేజీల నివారణకు సాంకేతికత వినియోగంపై దృష్టి

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4:

జాతీయ పరీక్షా విధానంలో సమగ్ర సంస్కరణలు తీసుకురావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పరీక్షల సంస్కరణల ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్ నందన్ నీలేకని చర్చించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో పారదర్శకమైన, నమ్మకమైన పరీక్షా విధానం రూపొందించాలని చంద్రబాబు సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించేలా విద్యా సంస్కరణలు ఉండాలన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని వివరించారు. పేపర్ లీకేజీల నివారణ, సైబర్ భద్రత, డిజిటల్ ఫోరెన్సిక్స్ బలోపేతంపై దృష్టి సారించినట్లు నీలేకని తెలిపారు.

తెలంగాణకు 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)

అంతరిక్ష, విమానయాన రంగాలకు బలమైన పునాది ఉందని పేర్కొన్నారు. పరిశోధనశాలలకే పరిమితమవుతున్న ఆవిష్కరణలను ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, ధ్రువీకరణ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రయోగాత్మకంగా విజయవంతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృత స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ నిల్వ, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయ రంగాల్లో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. **సాంకేతికతతో యువతకు ఉపాధి అవకాశాలు** సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణను ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, ఆధునిక పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా దేశీయంగా ఉత్పత్తులను అభివృద్ధి చేసి, ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. యువతకు నైపుణ్య శిక్షణ, పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.ఫిక్కీ వందేళ్ల ప్రస్థానాన్ని అభినందించిన భట్టి విక్రమార్క, రాష్ట్ర అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలని కోరారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

క్రమశిక్షణ ఉల్లంఘనపై కాంగ్రెస్ అధిష్టానం గుర్రు!

(మొదటి పేజీ తరువాయి)

రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన సభకు తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు తరలివెళ్లారు. అయితే మొత్తం 13 మంది ఎమ్మెల్యేలు సభకు గైర్హాజరైనట్లు టీపీసీసీ గుర్తించింది. వారిలో నలుగురు వ్యక్తిగత, కుటుంబ కారణాలతో ముందస్తు అనుమతి తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన తొమ్మిది మంది ఎందుకు హాజరుకాలేదో వివరించాలని ఏఐసీసీ కోరింది. గైర్హాజరైన వారిలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు కూడా ఉన్నారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధిష్టానం స్పష్టం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

14వ వార్డులో ప్రజల తాగునీటి అవసరాల కోసం బోరు ఏర్పాటు

● దివిస్ పరిశ్రమ సహకారంతో బోరు వేయించిన కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్



తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 4: మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చౌటుప్పల్ పురపాలక సంఘం చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ఆదేశాల మేరకు 14వ వార్డు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని దివిస్ పరిశ్రమ యాజమాన్యం సహకారంతో బోరు ఏర్పాటు చేశారు. 14వ వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్, కోఆప్షన్ సభ్యులు సందగల్ల విజయ సతీష్ పర్యవేక్షణలో ఈ బోరు వేయించడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ మాట్లాడుతూ.. 14వ వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్‌కు, బోరు ఏర్పాటుకు సహకరించిన దివిస్ పరిశ్రమ యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 14వ వార్డు ప్రజలందరూ ఐకమత్యంతో కలిసి ఉంటూ వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సందగల్ల విజయ సతీష్, వర్కాల రవిగౌడ్, కామిశెట్టి చంద్రశేఖర్, ఓరగంటి భాను, మండలోజు శ్రీధర్ చారి, భాను గౌడ్, ఎస్.కె. మున్నా, రాజపేట యాదగిరి చారి, ఉడుగు కృష్ణ, ఎస్.కె. జహీర్, మలిగే శ్రీను, ఉడుగు నరసింహ, ఉరకాల శివ, ఉడుగు నవీన్, ఉడుగు సాయికుమార్, మండలోజు మనోజ్ చారి, వర్కాల లలిత, వర్కాల భాను, వర్కాల వెన్నెల, పద్మ, వర్కాల మంజుల, వర్కాల పద్మ, రాజపేట రమాదేవి, ఓరగంటి ఇందిర, చిలువేరు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేలపట్ల ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులపై వేధింపులా?

- వార్డెన్ సైదులును సస్పెండ్ చేయాలి.. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి: చౌటుప్పల్ బీఆర్ఎస్వీ నాయకులు




తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 4:యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల పట్ల వార్డెన్ సైదులు దురుసుగా ప్రవర్తిస్తూ, అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరించడం, దాడికి ప్రయత్నించారనే ఆరోపణలపై చౌటుప్పల్ బీఆర్ఎస్వీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమం, భద్రతకు బాధ్యత వహించాల్సిన వార్డెన్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై చౌటుప్పల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేసి, విద్యార్థుల నుంచి నేరుగా వివరాలు సేకరించి, సాక్ష్యాధారాలతో నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వార్డెన్ సైదులును తక్షణమే సస్పెండ్ చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు భద్రతతో కూడిన గౌరవప్రదమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల నాయకులు గంగాదేవి శివ, మున్సిపల్ నాయకులు ఊదరి రాకేష్, ఎండీ అంతు, అశోక్, మీసాల సుమంత్, మెడకంటి విష్ణు, తన్నీరు నందివర్ధన్, దూడి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రినిటీ పాఠశాల వ్యవహారంపై స్పందించిన బాలల హక్కుల కమిషన్

- పాఠశాల శాఖలు, విద్యార్థుల భద్రతపై విచారణ జరపాలని కలెక్టర్‌కు లేఖ..

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి: ముటుకులోజు రాఘవ





TELANGANA STATE COMMISSION FOR PROTECTION OF CHILD RIGHTS
H.No.8-3-222, Vengalrao Nagar, Yousufguda, Hyderabad-38
Mail ID: tscpcrhyd@gmail.com, Office No. 040-29566122

From
Smt. C.Subhadra,
Secretary,
TGSCPCR, Hyderabad.

To
The Collector & District Magistrate,
Yadadri Bhuvanagiri district

Lr. No. 383/TGSCPCR/2026-02, Dt: 22.10.2026

Sir/Madam,

Sub: TGSCPCR, Hyderabad -Petition and RTI application received from Mr. M. Raghava Road. No. 38, Muthyalamma Nagar, Choutuppal – ATR called for- reg.

Ref: 1. Petition and RTI application received from Mr. M. Raghava on 26.09.2026.
2. Instructions of the Commission.

The Telangana State Commission for Protection of Child Rights is a statutory body constituted under the act of Parliament (Commissions for Protection of Child Rights Act, 2005) and mandated to ensure that all laws, policies, programs, administrative mechanisms and procedures of the governments are in consonance with the child rights perspective as enshrined in the Constitution of India and to monitor the implementation of the key acts - JJ Act, 2015, POCSO Act, 2012 and RTE Act, 2009.

The Commission has received a petition from Shri M. Raghava, expressing concerns regarding alleged violations of Educational rights, Muncipal by-laws and safety regulations under Motor Vehicles Act in Trinity School, Choutuppal, Yadadri Bhuvanagiri district.(copy of the petition enclosed).

In this regard, the Commission directs the Collector and District Magistrate, Yadadri Bhuvanagiri district to enquire into the matter and furnish the Action Taken Report to the Commission at the earliest.

Yours faithfully,
Secretary,
TGSCPCR, Hyderabad

Copy to the District Educational Officer, Yadadri Bhuvanagiri
Copy to the Commissioner & Director of School Education Dept., Telangana
Copy to the Municipal Commissioner, Choutuppal Municipality
Copy to the Superintendent of Police, Yadadri Bhuvanagiri district
Copy to the petitioner

తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 4: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రినిటీ పాఠశాల నిర్వహణపై తాను చేసిన ఫిర్యాదుకు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించిందని బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ముటుకులోజు రాఘవ తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, తీసుకున్న చర్యల నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌కు కమిషన్ లేఖ రాసినట్లు వెల్లడించారు. పాఠశాల ప్రధాన క్యాంపస్‌తో పాటు అదనపు శాఖలకు ప్రత్యేక గుర్తింపులు, అనుమతులు ఉన్నాయా? భవనాల సామర్థ్యం, అగ్నిమాపక భద్రత, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల రవాణా భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని రాఘవ కోరారు. గతంలో పలుమార్లు ఫిర్యాదులు, సమాచార హక్కు దరఖాస్తులు సమర్పించినా పూర్తిస్థాయి విచారణ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత శాఖల అధికారులతో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని, నిబంధనల ఉల్లంఘనలు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలల హక్కుల కమిషన్ స్పందన లేఖలకే పరిమితం కాకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ముటుకులోజు రాఘవ కోరారు.

తూప్రాన్‌పేట ప్రభుత్వ పాఠశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఆటస్థలం, కనీస మౌలిక వసతులు కల్పించాలి: ఎస్ఎఫ్ఐ గ్రామ శాఖ నాయకులు





తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 4: చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎస్ఎఫ్ఐ గ్రామ శాఖ నాయకులు సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యత, మెనూ అమలు తీరు, పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో పాటు మధ్యాహ్న భోజన నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడం ఆందోళనకరమన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, ఆటలు ఆడుకునేందుకు తగిన ఆటస్థలాన్ని కేటాయించాలని, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకొని విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. పాఠశాలలో ఉపాధ్యాయులు తగిన సంఖ్యలో ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం ప్రభుత్వ విద్యావ్యవస్థలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతోందని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించి ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి సహకరించాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ తూప్రాన్‌పేట గ్రామ శాఖ కార్యదర్శి లవణం సాత్విక్, గ్రామ శాఖ నాయకులు రాజు, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి


- బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు.. ప్రతి విక్రయ కేంద్రంలో ధరల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్



తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి నవంబర్- 04: జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డితో కలిసి బియ్యం ధరల నియంత్రణ, సరఫరా వ్యవస్థ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ విక్రయదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బియ్యం నిత్యావసర వస్తువని, ప్రజలకు నిర్ణీత ధరలకు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో బియ్యం విక్రయించే ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ. 74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79గా రిటైల్ విక్రయ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరలకు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదని స్పష్టం చేశారు. మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలపై స్పష్టమైన సమాచారం అందించాలని, సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, నిల్వలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని వ్యాపారులకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ఉల్లంఘించి బియ్యం విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమంగా నిల్వలు దాచిపెట్టినా సరుకును వెంటనే స్వాధీనం చేసుకొని వేలం వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ధరల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డీఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు, లీగల్ మెట్రాలజీ అధికారి, సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ విక్రయదారులు, శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఏన్కూరు ప్రభుత్వ వైద్యాధికారి బాలకృష్ణ సూచనలు



తొలి అక్షరం/ఏన్కూర్ నవంబర్ 4: వర్షాల నేపథ్యంలో మండల ప్రజలందరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏన్కూరు ప్రభుత్వ వైద్యాధికారి బాలకృష్ణ సూచించారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తడిసిన దుస్తులను వెంటనే మార్చుకోవాలని, చల్లని వాతావరణంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని వైద్యాధికారి బాలకృష్ణ సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తమ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే శంకర్

లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 04: షాద్‌నగర్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించుకున్న కళమ్మ నూతన గృహప్రవేశ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారుల కుటుంబాలను కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సంతోషంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు కల నెరవేరడం ఎంతో సంతోషకరమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు దోహదపడుతోందన్నారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ దిలీప్, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, ముబారక్ అలీ ఖాన్, చందులాల్, మాధవులు యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, రాజు గౌడ్, గడ్డమీది రమేష్, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

నవంబర్ 6న ధర్నాను జయప్రదం చేయాలి

- పట్టణ ప్రాంత పేదలకు ఉపాధి హామీ కల్పించాలి



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 04: షాద్‌నగర్ పట్టణ ప్రాంత పేదలకు ఉపాధి హామీ కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, షాద్‌నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలో ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఏడాదికి 200 రోజుల పని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని, మేట్లకు కనీస వేతనాలు నిర్ణయించి, ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెంచాలని కోరారు. పెండింగ్ వేతనాలు విడుదల చేసి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు నవంబర్ 6న హైదరాబాద్‌లోని సీఆర్‌డీ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి: చైర్మన్ బసవేశ్వర్

- 1, 12వ వార్డుల్లో నూతన బోరు మోటార్లు ప్రారంభం



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 4: నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించుకోవాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ సూచించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 1, 12వ వార్డుల్లో ప్రజల తాగునీటి అవసరాల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన బోరు మోటార్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నీరు విలువైన సహజ వనరని, భవిష్యత్తు తరాలకు నీటి కొరత రాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అవసరమైనంత మేరకే నీటిని వినియోగించుకోవాలని, ఎక్కడైనా నీరు వృథాగా పారుతుంటే వెంటనే అరికట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ తరఫున అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గౌస్ జానీ, కళ్యాణ్ కార్ దిలీప్, శ్రీశైలం గౌడ్, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు ట్రాఫిక్ సీఐ ఉపేందర్‌కు ఎమ్మెల్యే శంకర్ సూచనలు

- ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే శంకర్



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 04: కొత్తూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ ఉపేందర్ బుధవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ నూతన సీఐకి అభినందనలు తెలియజేశారు. ట్రాఫిక్ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణాలు, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజల రాకపోకలకు ఆటంకాలు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.

కాటమయ్య ఆలయ నిర్మాణానికి అంకురార్పణ

● నిదానపల్లిలో వైభవంగా భూమిపూజ..

పెద్ద సంఖ్యలో పాల్గొన్న గౌడ కులస్తులు




తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 4: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామంలో కాటమయ్య స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. గౌడ సంఘం చైర్మన్ డాక్టర్ కొండ మల్లేశం గౌడ్, ముస్తాది దారుడు వీరమల్ల భిక్షం గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా సాగింది.సిద్ధాంతి బేతాజీ సత్యనారాయణ శాస్త్రి, దీక్షితులు శశిధర్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన గౌడ కులస్తులు, కుల పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తితో పూజల్లో పాల్గొన్నారు.కాటమయ్య స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ నిర్మాణం చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బొంగు నరసింహ గౌడ్ దశదిన కర్మకు హాజరై నివాళులర్పించిన గుత్తా అమిత్ రెడ్డి



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 4: చిట్యాల మండలం ఊరుమడ్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంగు శంకరయ్య గౌడ్ సోదరుడు బొంగు నరసింహ గౌడ్ ఇటీవల మృతి చెందడంతో బుధవారం నిర్వహించిన ఆయన దశదిన కర్మ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని నరసింహ గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, సర్పంచ్ సాగర్ల భువనేశ్వర్, బిక్షం యాదవ్, ఉపసర్పంచ్ ఉయ్యాల నరేష్, వార్డు సభ్యుడు హరిప్రసాద్, మాజీ ఎంపీటీసీ పోలగాని స్వామి, గుత్తా దేవేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకు సైదులు, కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, చీమల వీరేశం, సత్తిరెడ్డి, జనార్ధన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో పాల్గొని ఆశీర్వదించిన సర్పంచ్ సాయికుమార్ గౌడ్



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 5: చిట్యాల మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో బోగారం గ్రామానికి చెందిన బద్దుల నరసమ్మ కుటుంబంలో జిట్టగోని వనజ (బేబీ), నరసింహ యాదవ్ దంపతుల చిన్నారులు ప్రణయ, మాధవ్, శివన్ యాదవ్‌ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోగారం గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో రామన్నపేట మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్ యాదవ్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ జడల ఆది మల్లయ్య, వార్డు సభ్యులు గోగు ప్రమీల రమేష్ యాదవ్, నేరటి మానస సురేష్ యాదవ్, బద్దుల పాపయ్య, చెల్లమల్ల నర్సిరెడ్డి, మేడి కృష్ణ, మధ్యపూరి సత్యనారాయణ, చెరుకు సత్తయ్య, చెరుకు శంకరయ్య, చెరుకు నరసింహ, గోగు మధు, బద్దుల మహేష్, బద్దుల ప్రవీణ్, గడగొట్ల మహేష్, బద్దుల మనోజ్ యాదవ్ తదితరులు పాల్గొని చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు.

ఆర్థిక సహాయం అందించిన దైవ రవీందర్

తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 5: నకిరేకల్ మున్సిపాలిటీ కేంద్రంలోని తాటికల్ రోడ్డు లిఓడ్డెర బస్తిలికాలనీకి లినిరుపేద లికుటుంబానికి చెందిన ,ఓర్సు యల్లమ్మ మృతి చెందడంతో వారి మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన వారికి లి(5000)ఆర్థిక సాయంఅందజేసి కుటుంబాన్ని ఓదార్చిన దైద రవీందర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధానలికార్యదర్శి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు



ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి

● నెలవారీ ఇవిఎం గోడౌన్ తనిఖీ చేపట్టిన జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్



తొలి అక్షరం/ఖమ్మంజిల్లా ప్రతినిధి, నవంబర్- 04: ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ నెలవారీ తనిఖీ చేశారు.ఇవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి, పనిచేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మొగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. తనిఖీ రిజిస్టర్లలో కలెక్టర్ సంతకం చేశారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు తదితరులు ఉన్నారు.

ఏఎన్ఎం కోర్సు ప్రవేశ దరఖాస్తుల గడువు నవంబర్ 10 వరకు పొడిగింపు

- ఇంటర్ పూర్తి చేసిన 17 ఏళ్లు నిండిన మహిళలు అర్హులు.. నవంబర్ 16 నుంచి తరగతులు ప్రారంభం: ప్రిన్సిపాల్ అనురాధ దేవి

తొలి అక్షరం/ఖమ్మంజిల్లా ప్రతినిధి, నవంబర్- 04: ఖమ్మం ప్రభుత్వ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) శిక్షణ పాఠశాలలో 202627 విద్యా సంవత్సరానికి ఏఎన్ఎం మొదటి సంవత్సరం కోర్సు ప్రవేశాల దరఖాస్తు గడువును నవంబర్ 10 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పి. అనురాధ దేవి తెలిపారు.ఇంటర్మీడియట్ పూర్తి చేసి 17 ఏళ్లు నిండిన మహిళా అభ్యర్థులు ఏ గ్రూపులో చదివినా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్ www.chfw.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ రుసుము రూ.200 డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి.ఆన్‌లైన్ దరఖాస్తు పత్రంతో పాటు పదో తరగతి, ఇంటర్, కుల, నివాస, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన ధ్రువపత్రాల ప్రతులను నవంబర్ 10లోగా శిక్షణ పాఠశాల ప్రిన్సిపాల్‌కు లేదా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలి. నవంబర్ 15 నాటికి ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి, నవంబర్ 16 నుంచి తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు.మరిన్ని వివరాలకు 8919393686, 8374706381 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

మంత్రి అడ్లూరిని మర్యాద పూర్వకంగా కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



తొలి అక్షరం/ఖమ్మంజిల్లా ప్రతినిధి, నవంబర్- 04: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం జగిత్యాల జిల్లాకు వెళ్ళిన ఫెడరేషన్ నాయకులు అక్కడే జిల్లా పర్యటనలో ఉన్న మంత్రిని కలిసి శాలువాతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షు కాసం శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కోశాధికారి కొండా సంజీవ కుమార్ తదితరులున్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ జగిత్యాల జిల్లా నేత రవీందర్ రావుకు పరామర్శ



తొలి అక్షరం /జగిత్యాల, జిల్లా ప్రతినిధి నవంబర్ 04:

అనారోగ్యంతో చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేన్నేని రవీందర్ రావు ను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు పరామర్శించారు. బుధవారం వారు జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రవీందర్ రావు ఆరోగ్య సమస్యలతో గత నెల రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఆయనను పరామర్శించిన వారిలో ఫెడరేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్, ఉపాధ్యక్షులు కాసం శ్రీనివాస్ రెడ్డి, రాగం రమేష్, సహాయ కార్యదర్శి అనంతుల కాంతారావు, కోశాధికారి మేన్నేని శ్రీనివాస రావు, కార్యవర్గ సభ్యుడు గోపాటి నరేందర్ రావు, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు జైపాల్, నాయకులు తిరునగరి శ్రీనివాస్, ఎం. నర్సయ్య తదితరులున్నారు.

పల్లె పల్లెనా ప్రభుత్వ దవాఖాన

పెదప్రజల ఆరోగ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

రూ.1.43 కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభంచేసిన పాలకుర్తి నియోజకవర్గం శాసనసభ్యురాలు మామిడాల యశశ్విని రెడ్డి

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి..

ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి స్థలం అందించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే.







తొలి అక్షరం/పెద్దవంగర నవంబర్ 4: మండల కేంద్రంలో ఎక్స్ వి ఫైనాన్స్ నిధులు రూ.1.43 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని బుధవారం పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి నూతన భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.పెద్దవంగర మండల కేంద్రంలో రూ.1.43 కోట్లతో నిర్మించిన ఈ నూతన భవనం ద్వారా మండల పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. నూతన భవనంలో అవసరమైన వైద్య సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ వైద్యులు, సిబ్బంది ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్య సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం విలువైన స్థలాన్ని అందించిన దాతలకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని సామాజిక ప్రయోజనం కోసం స్థలాన్ని అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని, స్థలదాతల సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. ప్రజా అవసరాల కోసం ముందుకొచ్చి సహకరించిన దాతల సేవాభావాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా ఉండాలని, ప్రతి గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రంగు మురళి, స్థానిక సర్పంచ్ ముద్దసాని పారిజాతం సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెహ్రూ నాయక్, వివిధ గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, డైరెక్టర్లు, పార్టీ మండల నాయకులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ ఆసుపత్రి చికిత్స కోసం రూ.2.40 లక్షల ఎల్ఓసీ చెక్కు అందజేత

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మాజీ సర్పంచ్ బక్క స్వప్న శ్రీనాథ్



తొలి అక్షరం/చౌటుప్పల్. నవంబర్ 4: చిన్ననాటి మిత్రుడు, చింతల జగన్ తండ్రి నర్సింహ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో రూ.2,40,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసీ చెక్కును మంజూరు చేయించడం జరిగింది.ఈ సందర్భంగా చిన్నకొండూరు గ్రామ మాజీ సర్పంచ్ స్వప్న శ్రీనాథ్ మాట్లాడుతూ, ఆపద సమయంలో స్పందించి వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా సహకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మరియు పబ్బు రాజు గౌడ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు అందించిన ఈ సహకారం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

లా విద్యార్థిని చంద్రకళ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

- చంద్రకళ చిత్రపటానికి నివాళులర్పణ.. కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 04:కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన విశ్వవిద్యాలయంలో న్యాయవాద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని డాకూరి చంద్రకళ ఆత్మహత్యకు పాల్పడటం తీవ్రంగా బాధించిందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని రైతు కాలనీలో నివాసముంటున్న చంద్రకళ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆమె చిత్రపటం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుంటూ, ప్రముఖ విశ్వవిద్యాలయంలో న్యాయవిద్య అభ్యసిస్తున్న చంద్రకళ మృతి దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ కష్టపడి చదువుకుంటూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. జీవితంలో స్థిరపడి కుటుంబానికి అండగా నిలవాల్సిన సమయంలో ఆమె మృతి చెందడం బాధాకరమన్నారు. చంద్రకళ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నటరాజన్, కౌన్సిలర్లు శారద శేఖర్, వసంత శ్రీనివాస్, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), పిన్నమోని గోపాల్, మాజీ కౌన్సిలర్ కానుగు అంతయ్య, మాజీ ఎంపీటీసీ బిశ్వ రామకృష్ణ, మాజీ సర్పంచ్ సాయిప్రసాద్ యాదవ్, నాయకులు నందిగామ శ్రీనివాస్, మల్చలం భిక్షపతి, అశోక్ యాదవ్, చెర్క శివ, కొండ మల్లేష్, రాఘవేందర్ గౌడ్, మంగ శ్రీశైలం, పిట్టల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన చంద్రశేఖర్





తొలి అక్షరం/జిల్లేడు చౌదరిగూడెం, నవంబర్ 4: నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కాస్లాబాద్, పీర్జాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వం తరఫున నూతన వస్త్రాలు అందజేశారు.చంద్రశేఖర్ మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పారదర్శకంగా అమలవుతోందని కొనియాడారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు, ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, సర్పంచులు కుమార్, నీలయ్య, మాజీ ఎంపీటీసీ సత్యంరెడ్డి, గ్రామ కమిటీ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధాపూర్ ఎకో టౌన్‌పై స్థానికుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలి

- మంత్రుల సమీక్షలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతి



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 4: షాద్‌నగర్: కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత ఎకో టౌన్‌పై స్థానికుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన రెవెన్యూ సమీక్ష సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి ఆర్డీఓలకు అధికారాలు కల్పించాలని, సాదాబైనామా, ఓఆర్‌సీ పట్టాలపై మార్గదర్శకాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సిద్ధాపూర్‌లో ఎకో టౌన్ ఏర్పాటుపై గ్రామస్థులు ఆందోళనలు చేస్తున్నారని వివరించారు. స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు సమస్యను పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం: ఎమ్మెల్యే నాయిని

- 47, 62వ డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. 98 శాతం పనులు పూర్తి చేశామని వెల్లడి





తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట అభివృద్ధికి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. కాజీపేటలోని 47, 62వ డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎస్సీ కాలనీల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం శిలాఫలకాలు ఏర్పాటు చేయడం అభివృద్ధి కాదని, ప్రారంభించిన పనులను పూర్తి చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. తమ పరిధిలో చేపట్టిన పనుల్లో సుమారు 98 శాతం పూర్తయ్యాయని వెల్లడించారు. 47వ డివిజన్ ఎస్సీ కాలనీలో మిగిలిన రోడ్ల పనులకు రూ.50 నుంచి రూ.60 లక్షల వరకు టెండర్లు పూర్తయ్యాయని, వారం నుంచి పది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన స్థలంపై కలెక్టర్‌ను సమగ్ర విచారణ కోరినట్లు చెప్పారు. ప్రభుత్వ భూమిగా తేలితే ప్రజా అవసరాల కోసం వినియోగిస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్ నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని భూములు, కాజీపేట చౌరస్తాలోని కాంప్లెక్స్ అనుమతులపై కూడా విచారణ కోరినట్లు తెలిపారు.ఇటీవల 42 మంది అర్హులకు ఇళ్లు అందించామని, పేదలకు ఇళ్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బోడగుట్ట, సమ్మయ్య నగర్, దీన్‌దయాళ్ నగర్, కంచరకుంట ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామని తెలిపారు. చోరబండ రాజు మాడవీధుల అభివృద్ధికి సుమారు రూ.30 కోట్లతో పనులు చేపడుతున్నామని, ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కుటుంబానికి ఒక ఉద్యోగం కల్పించినట్లు గుర్తుచేశారు.కాజీపేటలో గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత మూడేళ్లలో చేపట్టిన పనులను ప్రజలే బేరీజు వేసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేం దర్ రెడ్డి అన్నారు. ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని, ఇచ్చిన హామీల అమలులో జవాబుదారీతనంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- ప్రభుత్వ నిర్ణయాలతో రైతులకు నష్టం.. బక్కని నరసింహులు విమర్శ



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 4: ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు విమర్శించారు. బుధవారం షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి ధాన్యం విక్రయానికి వచ్చిన రైతుల పరిస్థితులను పరిశీలించారు. వర్తక వ్యాపారులతో మాట్లాడి ప్రస్తుత ధరలు, కొనుగోళ్ల తీరును అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ పంటలు పండిస్తున్నారని, పెట్టుబడి ఖర్చులు పెరిగిన నేపథ్యంలో తగిన ధర లభించకపోతే తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. బియ్యం ధరలను నియంత్రించే పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైతులకు నష్టం కలిగించేలా ఉన్నాయని, అత్తను కోలుకోమని కోడలిని దోచుకోమన్న చందంగా ప్రభుత్వ తీరు ఉందని వ్యాఖ్యానించారు. దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కే. శివకుమార్, అన్మారి వెంకటయ్య, శంకర్‌రెడ్డి, యాదయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆహార ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవం

•ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి





తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి: ఐనవోలు మండలం పున్నెలు క్రాస్ వద్ద ఐనవోలు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన ఆహార ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు,హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి,హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ హాజరై రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ...నేటి పోటీ ప్రపంచంలో యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడటమే కాకుండా,స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.నూతనంగా వ్యాపార రంగంలోకి అడుగుపెడుతున్న యువతకు ప్రోత్సాహం అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఆహార ఫ్యామిలీ రెస్టారెంట్ నిర్వాహకులు ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ,వినియోగదారుల ఆదరాభిమానాలతో వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకుడు,ఐనవోలు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్‌కు ఎమ్మెల్యే,ఇతర నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు,ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు,చైర్మన్లు,మండల అధ్యక్షులు,సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీ కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం

- కుటుంబ సభ్యులకు అందజేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి: ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సల్ల సమ్మయ్య ఉపాధి హామీ పథకం పనుల్లో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు మరణించిన నేపథ్యంలో,వారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సహాయం చెక్కును వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న సమ్మయ్య మరణం బాధాకరమని,ఆయన కుటుంబానికి ఈ కష్టకాలంలో అండగా ఉండటంతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు,సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అందిన ఈ ఆర్థిక సహాయం కొంతవరకు తోడ్పాటుగా నిలుస్తుందని పేర్కొన్నారు.బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోశాల వెంకన్న,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈగ దామోదర్,ఏఎంసీ మాజీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తూల్ల రవి,పలువురు సీనియర్ నాయకులు,సర్పంచులు, కౌన్సిలర్లు,వార్డు సభ్యులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమం,సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

- ఇనగాల వెంకట్రామిరెడ్డి,ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు...



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ఐనవోలు మండలంలోని పున్నెలు స్టేజి వద్ద ఆదర్శ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ బోర్డును హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డితో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఆటో డ్రైవర్లు నిత్యం ప్రజలకు రవాణా సేవలు అందిస్తూ సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.ఎండ,వాన అనే తేడా లేకుండా కష్టపడి కుటుంబాలను పోషించుకుంటూ,ప్రజల ప్రయాణ అవసరాలను తీరుస్తున్న ఆటో డ్రైవర్ల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ఆటో డ్రైవర్లు ఐక్యంగా ఉంటూ తమ హక్కులు,సంక్షేమం కోసం సంఘటితంగా ముందుకు సాగాలని సూచించారు.అసోసియేషన్ ద్వారా డ్రైవర్ల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని అన్నారు.ఆటో డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ,ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరిస్తూ బాధ్యతాయుతంగా సేవలందించాలని ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు.నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,అసోసియేషన్ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్,మండల యూత్ అధ్యక్షులు కత్తి సుధీర్ గౌడ్,హన్మకొండ జిల్లా జెబిఎం చైర్మెన్ జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి,సీనియర్ నాయకులు రాయపుర సాంబయ్య,మండల సీనియర్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

వేంను కలిసిన అంబేద్కర్ సంఘం నాయకులు

•రూ. కోటి యాభై లక్షలు విడుదలకు ధన్యవాదాలు





తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 4: స్వర్ణోత్సవాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ సలహాదారులు, రాజ్యసభ సభ్యులు వేం విచ్చేయాలని కోరినట్లు తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తెలిపారు. బుధవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ సలహాదారులు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు జేబీ రాజు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు చీపురుపల్లి ఐలయ్య, మహబూబాబాద్ తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కామ సంజీవరావు లు కలిసి ఈనెల 14వ తేదీన తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్ర భవనంలో నిర్వహించనున్న తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటుచేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించనున్న సర్వోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని వేం నరేందర్ రెడ్డి కలిసి కోరినట్లు వారు తెలిపారు. కేసముద్రం పురపాలక సంఘ కేంద్రంలో అంబేద్కర్ సంఘం భవన నిర్మాణానికి రూ కోటి 50 లక్షలు నిధుల విడుదలకు కృషి చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం సర్వోత్సవాలకు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, అంబేద్కర్ వాదులు, దళిత సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ సన్న ఉత్సవాలను జయప్రదం చేరని వారు కోరారు. కలిసిన వారిలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందుల సామెల్, అంబేద్కర్ యువజన సంఘం కేసముద్రం మండల గౌరవ అధ్యక్షులు నాగన్న, మండల అధ్యక్షులు వల్లందాస్ రవి, తదితరులు ఉన్నారు.

తుడుం దెబ్బ మీటింగ్‌ను అడ్డుకుంటాం



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 4: తుడుం దెబ్బ మీటింగును అడ్డుకుంటామని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బోడ రమేష్ నాయక్ హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వినాయక తండాలో లంబాడి హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షులు ధరావత్ హాథిరం నాయక్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ ప్రాచీన వేషధారణ, ప్రత్యేక సాంప్రదాయం, ప్రత్యేక భాష గోర్ బోలి ను కలిగి, పూర్వం యావత్ సమాజానికి సన్మార్గంలో నడవాలని బోధించిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ వారసులమైన లంబాడీల మనోభావాలను దెబ్బతీసే విధంగా బహిరంగంగా పోస్టర్ల రూపంలో, కరపత్రాల రూపంలో లంబాడీల మనోభావాలను దెబ్బతీస్తూ, లంబాడీ సామాజిక వర్గ ప్రజలను కించపరిచే విధంగా డిసెంబర్ 9న మానుకోటలో తుడుం దెబ్బ తలపెట్టిన మీటింగ్ ను అతి పెద్ద గిరిజన జిల్లా అయిన మానుకోటలో వేల మంది లంబాడి ప్రజలతో అడ్డుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో లంబాడీల గురించి మాట్లాడే ముందు రాజ్యాంగంలోని చట్టాలను చదవాలని హితువు పలికారు. తెలంగాణ రాష్ట్రంలో 95 శాతం మంది లంబాడి ప్రజలు ఇంకా పశువు సంపదను మరియు భూములను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ గ్రామాలకు దూరంగా ప్రత్యేక తండాలను ఏర్పాటు చేసుకుని అడవులలో నివసిస్తూ దుర్భేద్యమైన జీవితాలను గడుపుతున్నారని అన్నారు. ఇప్పటివరకు మారుమూల తండాలకు రోడ్లు లేని పరిస్థితులు చాలా ఉన్నాయని తెలియజేశారు. చట్టాల గురించి తెలియని మూర్ఖులు రాత్రికి రాత్రే రాజకీయ నాయకులు కావాలనే ఉద్దేశంతో లంబాడి ప్రజల గురించి నోటికి వచ్చినట్టు మాట్లాడితే నాలుక చిరుతామని హెచ్చరించారు. డిసెంబర్ 9న లంబాడి హక్కుల పోరాట సమితి తలపెట్టిన కార్యక్రమంలో యావత్ లంబాడి జాతి ప్రజలు అందరూ స్వచ్ఛం దంగా పాల్గొని జాతి ఐక్యతను చాటాలని కోరారు. జిల్లా కార్యదర్శి ధారావత్ శ్రీనివాస్ నాయక్, టౌన్ నాయకులు వీరన్న నాయక్, లాలు నాయక్, అశోక్ నాయక్, బిచ్చు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్యాయంపై అక్షర సమరం..
'తొలి అక్షరం' సరికొత్త సమరభేరి

- తొలి అక్షరం ఎడిటర్ పస్తం సైదులు

- ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు దూలం శ్రీనివాస్ గౌడ్ ప్రశంసలు

- తొలి అక్షరం దినపత్రిక ముద్రణా సందర్భంగా కేక్ కటింగ్

హాజరైన తొర్రూర్ వర్కింగ్ జర్నలిస్టులు







మీడియా రంగంలో సరికొత్త అధ్యాయం: దూలం శ్రీనివాస్ గౌడ్

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (పస్తం సాంబ) నవంబర్ 4: సమాజంలోని అన్యాయాలను నిలదీస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా తొలి అక్షరం దినపత్రిక నిరంతరం శ్రమిస్తుంది అని తొలి అక్షరం దినపత్రిక ఎడిటర్ పస్తం సైదులు అన్నారు.నిజాయితీకి నిలువెత్తు రూపంగా పాఠకుల ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక ముద్రణా రూపంలో (ప్రింటింగ్ పేపర్) పాఠకుల ముంగిట్లోకి వస్తున్న శుభసందర్భంగా తొర్రూరు డివిజన్ పరిధిలో బుధవారం పండగ వాతావరణం నెలకొంది. తొర్రూరు డివిజన్ వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో తొలి అక్షరం దినపత్రిక ఎడిటర్ పస్తం సైదులు సమక్షంలో కేక్ కట్ చేసి జర్నలిస్ట్ సోదరులకు, పత్రిక సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎడిటర్ పస్తం సైదులు మాట్లాడుతూ.. సమాజంలో మరుగున పడుతున్న నిజాలను నిర్భయంగా వెలికితీస్తూ తొలి అక్షరం జర్నలిస్టులు చేస్తున్న అహర్నిశల శ్రమే తొలి అక్షరం స్వల్ప కాలంలోనే ప్రతి ఇంటికీ చేరడానికి కారణమైందని కొనియాడారు.అధికార యంత్రాంగాన్ని ప్రశ్నిస్తూ, బాధితుల వైపు నిలబడటమే పాత్రికేయ ధర్మం అని పేర్కొన్నారు.జర్నలిజం విలువలను కాపాడుతూ, ఎక్కడా రాజీ పడకుండా నిష్పక్షపాత వార్తలతో పత్రికను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు తొలి అక్షరం జర్నలిస్టులు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.



అక్షరాన్ని సత్యాయుధంగా మలచి, ప్రజా పక్షాన సమరం చేస్తున్న తొలి అక్షరం నేడు ప్రింటింగ్ రూపంలో పాఠకుల చేతుల్లోకి రావడం ఎంతో గర్వకారణం అని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యులు దూలం శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు.ఎడిటర్ పస్తం సైదులు సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో వర్కింగ్ జర్నలిస్టుల ఐక్యతతో తొలి అక్షరం దినపత్రిక ప్రతి ఇంటా నిలిచి మీడియా రంగంలో ఒక సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరిస్తుందని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో తొర్రూరు డివిజన్ వర్కింగ్ జర్నలిస్టులు, నన్నపునేని నారాయణ రాజు, పులి సతీష్, తాటికొండ సదాశివరావు, ఇమ్మడి రాంబాబు, లకావత్ యాదగిరి, జిలుకర రాజు, కొండెం అశోక్ రెడ్డి, ఎడ్ల మహేష్, ఎనగందుల సంతోష్, మియాపురం రమాకాంత్, పంజాల శ్రీకాంత్, ఆంజనేయులు, కొమ్మనబోయిన యాకన్న, చౌడవరపు రాము, దేవేందర్, బందు మహేందర్, సిరికొండ విక్రమ్ కుమార్, తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో ప్రతినిధి పస్తం సాంబతో పాటు పత్రిక ప్రతినిధులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రేయసికి అంకితమైన అర్ష్‌దీప్ వికెట్ సంబరాలు!

- న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో ప్రత్యేక నృత్యంతో సందడి.. ప్రేయసి సమ్రీన్ కౌర్ కోసమేనని వెల్లడించిన భారత పేసర్



ఆక్లాండ్: భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ మైదానంలో చేసిన ఓ ప్రత్యేక సంబరం అభిమానులను ఆకట్టుకుంది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో వికెట్ తీసిన అనంతరం అతడు చేసిన వినూత్న నృత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ సంబరం వెనుక ఉన్న అసలు కారణాన్ని అర్ష్‌దీప్ స్వయంగా వెల్లడించడంతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తన ప్రేయసి, నటి సమ్రీన్ కౌర్‌కు ఆ సంబరాన్ని అంకితం చేసినట్లు తెలిపాడు.**వికెట్ తీసి.. ప్రత్యేకంగా సంబరాలు**న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత బౌలర్లు అద్భుతంగా రాణించారు. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా కైల్ జేమీసన్‌ను ఔట్ చేసిన అనంతరం అర్ష్‌దీప్ మైదానంలో ప్రత్యేకమైన నృత్యంతో సంబరాలు చేసుకున్నాడు. అతడి వినూత్న హావభావాలు చూసి సహచర ఆటగాళ్లతోపాటు అభిమానులు కూడా ఆశ్చర్యపోయారు.**ప్రేయసి కోసమేనని వెల్లడి**తన సంబరాల వెనుక ఉన్న కారణాన్ని మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ వివరించాడు. తాను, తన ప్రేయసి బయటకు వెళ్లినప్పుడు సరదాగా చేసే నృత్య అడుగులనే మైదానంలో ప్రదర్శించినట్లు తెలిపాడు. ఇద్దరిలో ఎవరికైనా మానసికంగా ఉత్సాహం తగ్గినప్పుడు ఇలాంటి చిన్న చిన్న సంబరాలతో ఒకరినొకరు ఉత్సాహపరుచుకుంటామని చెప్పాడు. అందుకే ఈసారి వికెట్ తీసిన ఆనందాన్ని ఆమెకు అంకితం చేసినట్లు వెల్లడించాడు.**నాలుగు వికెట్లతో ఆకట్టుకున్న పేసర్**ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ తన బౌలింగ్‌తోనూ ఆకట్టుకున్నాడు. పది ఓవర్లలో 70 పరుగులిచ్చి నాలుగు వికెట్లు సాధించాడు. విల్ యంగ్, హెన్రీ నికోల్స్, కైల్ జేమీసన్, గ్లెన్ ఫిలిప్స్‌లను పెవిలియన్‌కు పంపాడు. అతడికి గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లు, అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లతో సహకరించారు. దీంతో న్యూజిలాండ్ జట్టు 40.2 ఓవర్లలో 185 పరుగులకే ఆలౌటైంది.**అభిమానుల్లో ఆసక్తి**అర్ష్‌దీప్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను మైదానంలో ప్రత్యేకంగా ప్రస్తావించడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. గతంలోనూ తన ప్రేయసి సమ్రీన్ కౌర్‌పై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన విమర్శలను అర్ష్‌దీప్ ఖండించాడు. వ్యక్తిగత జీవితాన్ని గౌరవించాలని అభిమానులకు సూచించాడు. తాజాగా మైదానంలో ఆమెకు ప్రత్యేకంగా సంబరాన్ని అంకితం చేయడంతో ఈ జంట మరోసారి వార్తల్లో నిలిచింది.క్రికెట్ మైదానంలో వికెట్ సాధించడం ఆటగాడికి ఆనందాన్ని ఇస్తుంది. ఆ ఆనందాన్ని తన జీవితంలో ప్రత్యేకమైన వ్యక్తితో పంచుకోవడం అర్ష్‌దీప్ సంబరానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఒకవైపు అద్భుతమైన బౌలింగ్‌తో జట్టుకు విజయావకాశాలు అందిస్తూనే, మరోవైపు తనదైన శైలిలో సంబరాలు చేసుకోవడం అభిమానులను ఆకట్టుకుంది. దీంతో అర్ష్‌దీప్ వికెట్ సంబరం మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వన్డే క్రికెట్‌లో విరాట్ కోహ్లీ ప్రపంచ రికార్డు!

- మూడో స్థానంలో 13 వేల పరుగుల మైలురాయి.. ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించిన కింగ్ కోహ్లీ



ఆక్లాండ్: టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 13 వేల పరుగులు పూర్తి చేసిన ప్రపంచంలోనే తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన తొలి వన్డేలో ఈ ఘనత సాధించాడు. ఇప్పటికే ఎన్నో రికార్డులను తన పేరిట లిఖించుకున్న కోహ్లీ, తాజాగా మరో మైలురాయిని అందుకుని తన ప్రత్యేకతను చాటుకున్నాడు.**12 పరుగులతో చరిత్రలోకి..** ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా భారత్-న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే జరిగింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ నిర్దేశించిన 186 పరుగుల లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీకి ఈ అరుదైన రికార్డును అందుకునే అవకాశం వచ్చింది. మ్యాచ్‌కు ముందు మూడో స్థానంలో 13 వేల పరుగులు పూర్తి చేయడానికి అతడికి మరో 12 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులోకి వచ్చిన కోహ్లీ తాను ఎదుర్కొన్న 13వ బంతికి 12వ పరుగు సాధించడంతో చారిత్రక మైలురాయిని చేరుకున్నాడు. దీంతో వన్డే క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు.**పాంటింగ్ రికార్డును అధిగమించిన కోహ్లీ**వన్డేల్లో మూడో స్థానంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ రెండో స్థానంలో ఉన్నాడు. పాంటింగ్ తన కెరీర్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 12,662 పరుగులు సాధించాడు. కోహ్లీ తాజాగా 13 వేల పరుగుల మార్కును అందుకోవడంతో అతడి కంటే ముందంజలో నిలిచాడు. శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర 9,747 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో కోహ్లీ, పాంటింగ్ మాత్రమే 10 వేల పరుగుల మార్కును దాటడం విశేషం.**నిలకడకు నిదర్శనం కోహ్లీ ప్రస్థానం**వన్డే క్రికెట్‌లో మూడో స్థానం అత్యంత కీలకమైన బ్యాటింగ్ స్థానంగా భావిస్తారు. ప్రారంభంలో వికెట్లు త్వరగా పడితే ఇన్నింగ్స్‌ను నిలబెట్టాల్సి ఉంటుంది. ఓపెనర్లు మంచి ఆరంభం ఇస్తే పరుగుల వేగాన్ని పెంచాల్సి ఉంటుంది. ఈ రెండు బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ కోహ్లీ ఎన్నో సంవత్సరాలుగా భారత జట్టుకు అండగా నిలుస్తున్నాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడటం, లక్ష్య ఛేదనలో బాధ్యత తీసుకోవడం అతడి ప్రత్యేకతగా నిలిచాయి. ఈ క్రమంలోనే మూడో స్థానంలో 13 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు.**శతకాలు, అర్ధశతకాలతో ప్రత్యేక గుర్తింపు** మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ కోహ్లీ 48 సెంచరీలు, 69 అర్ధసెంచరీలు సాధించాడు. అతడి సగటు కూడా 61కు పైగా ఉండటం విశేషం. అంతర్జాతీయ వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలోనూ సచిన్ టెండూల్కర్ తర్వాతి స్థానంలో కోహ్లీ కొనసాగుతున్నాడు. ప్రతి మ్యాచ్‌లోనూ కొత్త రికార్డుల దిశగా సాగుతున్న అతడి ప్రస్థానం భారత క్రికెట్ అభిమానులకు ప్రత్యేక ఆనందాన్ని అందిస్తోంది.**సచిన్ రికార్డుపై కన్ను**వన్డే క్రికెట్‌లో ఒక నిర్దిష్ట బ్యాటింగ్ స్థానంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సచిన్ 15,310 పరుగులు సాధించాడు. ఇప్పుడు మూడో స్థానంలో 13 వేల పరుగులు పూర్తి చేసిన కోహ్లీ, ఈ అరుదైన ఘనతతో మరోసారి ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించాడు. భవిష్యత్తులో మరిన్ని మైలురాళ్లను చేరుకునే అవకాశం అతడికి ఉంది.రికార్డులు సృష్టించడం ఒక ఎత్తయితే.. వాటిని నిలకడైన ప్రదర్శనతో అందుకోవడం మరో ఎత్తు. విరాట్ కోహ్లీ ప్రస్థానం ఈ విషయాన్ని నిరూపిస్తోంది. జట్టుకు అవసరమైన సమయంలో బాధ్యత తీసుకుంటూ, పరుగుల వేటలో తనదైన ముద్ర వేస్తున్నాడు. వయసుతో సంబంధం లేకుండా ఆటపై అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగుతున్నాడు. మూడో స్థానంలో 13 వేల పరుగుల ప్రపంచ రికార్డు కోహ్లీ వ్యక్తిగత ఘనత మాత్రమే కాదు.. భారత క్రికెట్ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిపోనుంది.

స్లెడ్జింగ్‌తో రెచ్చగొట్టి.. వికెట్‌తో బదులిచ్చిన గుర్నూర్ బ్రార్!



- బ్లెయిర్ టిక్నర్‌తో మాటల యుద్ధం.. మరుసటి బంతికే పెవిలియన్‌కు పంపిన భారత యువ పేసర్.. వైరల్‌గా మారిన వీడియో

ఆక్లాండ్: భారత్-న్యూజిలాండ్ మధ్య జరిగిన తొలి వన్డేలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. భారత యువ పేసర్ గుర్నూర్ బ్రార్, న్యూజిలాండ్ బ్యాటర్ బ్లెయిర్ టిక్నర్ మధ్య మైదానంలో జరిగిన మాటల యుద్ధం అభిమానులను ఆకట్టుకుంది. ప్రత్యర్థి బ్యాటర్‌ను మాటలతో రెచ్చగొట్టిన గుర్నూర్.. మరుసటి బంతికే వికెట్ తీసి తన సత్తా చాటాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.**మాటల యుద్ధానికి తెరలేపిన గుర్నూర్** న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 41వ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. అప్పటికే చివరి వికెట్ కోసం భారత బౌలర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. క్రీజులో ఉన్న బ్లెయిర్ టిక్నర్ దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ భారత బౌలర్లకు సవాల్ విసురుతున్నాడు. ఈ క్రమంలో గుర్నూర్ వేసిన బౌన్సర్‌ను టిక్నర్ సరిగ్గా ఆడలేకపోయాడు. దీంతో గుర్నూర్ ఫుల్ షాట్ ఎలా ఆడాలో చేతులతో సైగలు చేస్తూ టిక్నర్‌ను ఆటపట్టించాడు.**తగ్గేదేలే అన్న టిక్నర్.. బౌలర్‌కు సవాల్** గుర్నూర్ సైగలకు టిక్నర్ కూడా ధీటుగా స్పందించాడు. వికెట్లను లక్ష్యంగా చేసుకుని బంతులు వేయాలని బౌలర్‌కు సూచిస్తూ బదులిచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు సరదా మాటల యుద్ధం సాగింది. అయితే గుర్నూర్ మాత్రం మాటలకే పరిమితం కాకుండా బంతితో సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నాడు.**మరుసటి బంతికే వికెట్.. సంబరాల్లో గుర్నూర్** టిక్నర్‌కు గుర్నూర్ వేసిన తర్వాతి బంతి కూడా షార్ట్ పిచ్‌గానే వచ్చింది. దాన్ని పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించిన టిక్నర్ బ్యాట్ అంచుకు తగిలించడంతో బంతి వికెట్ల వెనుకకు వెళ్లింది. అప్రమత్తంగా ఉన్న వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ క్యాచ్ అందుకోవడంతో టిక్నర్ ఇన్నింగ్స్ ముగిసింది. వెంటనే గుర్నూర్ సంబరాలు చేసుకున్నాడు. టిక్నర్ కూడా చిరునవ్వుతో మైదానాన్ని వీడటం క్రీడాస్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది.**నాలుగు సిక్సర్లతో టిక్నర్ పోరాటం** ఈ మ్యాచ్‌లో టిక్నర్ చివరి వికెట్‌గా వచ్చి భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 23 బంతుల్లో 34 పరుగులు సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఒక ఫోర్, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. జాకబ్ డఫీతో కలిసి చివరి వికెట్‌కు 39 పరుగులు జోడించి న్యూజిలాండ్ స్కోరును పెంచాడు. వన్డేల్లో 11వ స్థానంలో బ్యాటింగ్ చేస్తూ ఒక ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు బాదిన ఆటగాళ్ల జాబితాలో మహమ్మద్ అమీర్, నసీమ్ షాలతో కలిసి టిక్నర్ నిలిచాడు.**మూడు వికెట్లతో గుర్నూర్ ప్రతిభ** ఈ మ్యాచ్‌లో గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లు పడగొట్టి భారత బౌలింగ్‌లో కీలక పాత్ర పోషించాడు. అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లతో రాణించగా, అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లు సాధించాడు. భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది.క్రికెట్‌లో మాటల యుద్ధాలు కొత్తేమీ కాదు. అయితే ప్రత్యర్థి ఆటగాడి సవాళ్లకు మాటలతో కాకుండా ఆటతో సమాధానం చెప్పడం ప్రత్యేకత. గుర్నూర్ బ్రార్ అదే చేసి చూపించాడు. స్లెడ్జింగ్ తర్వాతి బంతికే వికెట్ సాధించడం మ్యాచ్‌లో ఆసక్తికర ఘట్టంగా నిలిచింది. మరోవైపు చివరి వికెట్‌గా వచ్చి టిక్నర్ చేసిన పోరాటం కూడా అభిమానులను ఆకట్టుకుంది. ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరిగిన ఈ సరదా పోటీ ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది.

న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం



- విరాట్ కోహ్లీ మెరుపు ఇన్నింగ్స్.. 74 పరుగులతో జట్టుకు అండ.. ఐదు వికెట్ల తేడాతో తొలి వన్డే కైవసం

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత భారత బౌలర్లు అద్భుతంగా రాణించి న్యూజిలాండ్‌ను 185 పరుగులకే కట్టడి చేయగా, లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీ 74 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 37 పరుగులతో రాణించడంతో భారత్ విజయం దిశగా సాగింది. వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ విధానంలో లక్ష్యాన్ని 143 పరుగులకు కుదించగా, భారత్ ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. **బౌలర్ల విజృంభణ.. 185 పరుగులకే కివీస్ ఆలౌట్** టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత యువ పేసర్లు అద్భుత ప్రదర్శనతో న్యూజిలాండ్ బ్యాటర్లను కట్టడి చేశారు. అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టి సత్తా చాటగా, గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లు సాధించాడు. దీంతో న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. టిమ్ సీఫర్ట్ 38, బ్లెయిర్ టిక్నర్ 34 పరుగులతో రాణించారు.**కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్.. గిల్‌తో కీలక భాగస్వామ్యం** 186 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి రెండో వికెట్‌కు 114 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కోహ్లీ బౌండరీలతో అలరిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.**51 బంతుల్లో 74 పరుగులు** విరాట్ కోహ్లీ కేవలం 51 బంతుల్లో 74 పరుగులు సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. మరోవైపు గిల్ 56 బంతుల్లో 37 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. వర్షం కారణంగా పలుమార్లు ఆటకు అంతరాయం ఏర్పడటంతో డక్‌వర్త్ లూయిస్ విధానంలో భారత్ లక్ష్యాన్ని 143 పరుగులకు కుదించారు.**సిరీస్‌లో భారత్‌కు శుభారంభం** చివరకు భారత్ 22.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 143 పరుగులు సాధించింది. దీంతో ఐదు వికెట్ల తేడాతో విజయం అందుకుంది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో తొలి వన్డేలో జట్టు ఆధిపత్యం ప్రదర్శించింది. ముఖ్యంగా యువ పేసర్ల ప్రదర్శన, కోహ్లీ బ్యాటింగ్ అభిమానులను ఆకట్టుకున్నాయి.వన్డే సిరీస్‌ను విజయంతో ప్రారంభించిన భారత్ రెండో మ్యాచ్‌లోనూ ఇదే జోరు కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. యువ బౌలర్లకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం, కోహ్లీ తన అనుభవంతో జట్టును విజయతీరాలకు చేర్చడం భారత జట్టుకు సానుకూల పరిణామాలు.

నా అభిమాన కెప్టెన్లు వారే!

సచిన్ మనసులో గంగూలీ, ధోనీకి ప్రత్యేక స్థానం



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనకు ఇష్టమైన కెప్టెన్ల పేర్లను వెల్లడించాడు. సౌరవ్ గంగూలీ, మహేంద్రసింగ్ ధోనీ తన అభిమాన కెప్టెన్లని తెలిపాడు. తాజాగా అభిమానులతో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు సచిన్ ఈ సమాధానమిచ్చాడు.భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవమని సచిన్ పేర్కొన్నాడు. అలాగే దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా నాయకత్వాన్ని ప్రశంసించాడు. జట్టును ముందుండి నడిపిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నాడని కొనియాడాడు.

రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీలకు కీలక అవకాశం!

సూపర్‌స్టార్ సరసన తొలిసారి.. ప్రత్యేక గ్లింప్స్‌తో పరిచయం చేసిన చిత్రబృందం



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న భారీ చిత్రం 'ధర్మన్'లో యువ కథానాయిక శ్రీలీల చేరారు. ఈ విషయాన్ని ప్రముఖ నటుడు, నిర్మాత కమల్‌హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ అధికారికంగా ప్రకటించింది. శ్రీలీలకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. 'ఆమెలో ప్రత్యేకమైన మెరుపు ఉంది.. అద్భుతమైన ఉత్సాహం ఉంది' అంటూ చిత్రబృందం ఆమెను పరిచయం చేసింది. ఈ చిత్రంలో శ్రీలీల పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.రజనీకాంత్, శ్రీలీల కలిసి నటించడం ఇదే తొలిసారి. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' చిత్రాలతో గుర్తింపు పొందిన అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ చిత్రంలో రజనీకాంత్ వైద్యుడి పాత్రలో కనిపించనున్నారు. అయితే ఆయన పాత్రలో మరో కోణం కూడా ఉంటుందని ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆసక్తిని పెంచుతున్నాయి. వైద్యుడిగా ఉంటూనే నేరగాళ్లపై పోరాడే పాత్రలో సూపర్‌స్టార్ కనిపించనున్నట్లు సమాచారం.ఈ సినిమాలో నయనతార, సిమ్రన్, రాశీఖన్నా, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. నికేత్ బొమ్మి ఛాయాగ్రహణం, ప్రదీప్ ఈ రాఘవ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.ఇప్పటికే మూడు విడతల చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'ధర్మన్' ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌కు చేరుకుంటోంది. ఈ చిత్రానికి విడుదల తేదీని నిర్మాతలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. శ్రీలీల చేరికతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



పెద్దలు కూడా పిల్లల్లా ఎంజాయ్ చేస్తారు!

నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు 'సమ్మర్ హాలిడేస్'.. ప్రీ రిలీజ్ వేడుకలో చిత్రబృందం

పిల్లలతో పాటు పెద్దలను కూడా తమ బాల్య జ్ఞాపకాలలోకి తీసుకెళ్లే కథాంశంతో రూపొందిన చిత్రం 'సమ్మర్ హాలిడేస్'. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని తన సొంత నిర్మాణ సంస్థ ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర్ దర్శకత్వం వహిస్తుండగా, మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబీ ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 6న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు నిర్మాత అల్లు అరవింద్, హీరో కిరణ్ అబ్బవరం, దర్శకుడు బాబీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నటి జయసుధ మాట్లాడుతూ.. ఈ సినిమాలో తాను అమ్మమ్మ పాత్రలో నటించానని తెలిపారు. ఇది కేవలం పిల్లల సినిమా కాదని, తల్లిదండ్రులు, అమ్మమ్మ, వేసవి సెలవుల నేపథ్యంలో అందరికీ అనుబంధం కలిగించే కథ అని చెప్పారు. ఇలాంటి మంచి చిత్రాలను నిర్మాత ధీరజ్ మరిన్ని నిర్మించాలని ఆకాంక్షించారు.



'కింగ్ 100'లో మహంతి ఝాన్సీ రాణిగా టబు!


- 28 ఏళ్ల తర్వాత నాగార్జున, టబు కలిసి నటిస్తున్న చిత్రం.. డిసెంబర్ 24న విడుదల

అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంగా 'కింగ్ 100'లో నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ సినిమాకు రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది.నటి టబు పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమె పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమె లిలిమహంతి ఝాన్సీ రాణిలిలిగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. 'ఈ ప్రపంచంలో రెండు రకాల మనుషులు ఉంటారు. లక్‌ను నమ్మేవాళ్లు ఒకరు.. కష్టాన్ని నమ్మేవాళ్లు మరొకరు. ఐ హేట్ లక్' అనే డైలాగ్‌తో ఆమె పాత్రను పరిచయం చేశారు.దాదాపు 28 ఏళ్ల తర్వాత నాగార్జున, టబు మరోసారి వెండితెరపై కలిసి నటిస్తున్నారు. గతంలో ప్రేమకథల్లో అలరించిన ఈ జంట ఈసారి యుద్ధ నేపథ్యంతో సాగే కథలో కనిపించనుండటం విశేషం. ఈ చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

రూ.వెయ్యి కోట్ల డీల్‌తో 'ఇట్లు అర్జున' ట్రైలర్ ఆసక్తికరం!

- ఎన్టీఆర్ విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్..
నవంబర్ 13న సినిమా ప్రేక్షకుల ముందుకు





అక్కినేని నాగార్జున సమర్పణలో తెరకెక్కుతున్న 'ఇట్లు అర్జున' చిత్రంతో కొత్త హీరో అనీష్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకీ కుడుముల నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను యంగ్ టైగర్ ఎన్టీఆర్ విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.ట్రైలర్ పోలీసుల వేటతో ప్రారంభమవుతుంది. ఓ దొంగను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తుండగా, అర్జున్ అనే మూగ యువకుడు కథలోకి ప్రవేశిస్తాడు. మాట్లాడలేకపోయినా అసాధారణ తెలివితేటలు కలిగిన అర్జున్.. కీర్తిని ప్రేమిస్తుంటాడు. అయితే అనూహ్యంగా ఈ జంట ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకుంటుంది. పోలీసులు, గూండాల ముఠా వారి కోసం గాలిస్తుంటారు.ఓ మిస్టరీ పెన్‌డ్రైవ్, దాని వెనుక ఉన్న రూ.వెయ్యి కోట్ల డీల్ కథలో ఉత్కంఠను పెంచుతున్నాయి. తొలి సినిమాతోనే భిన్నమైన కథను ఎంచుకున్న అనీష్‌ను ఎన్టీఆర్ అభినందించారు. ఈ చిత్రం నవంబర్ 13న విడుదల కానుంది.

ధనుష్ 'ఓం' తెలుగు రాష్ట్రాల విడుదల హక్కులు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు!

నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు చిత్రం.. భారీ తారాగణంతో యాక్షన్ డ్రామా



తమిళ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం 'ఓం' తెలుగు రాష్ట్రాల విడుదల బాధ్యతలను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ దక్కించుకుంది. నిర్మాత నాగవంశీ ఆధ్వర్యంలోని ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సినిమాను విడుదల చేయనుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అమరన్' చిత్రంతో గుర్తింపు పొందిన రాజ్‌కుమార్ పెరియసామి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్‌తో పాటు మలయాళ స్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో నటిస్తున్నారు. సాయిపల్లవి, శ్రీలీల కథానాయికలుగా కనిపించనుండగా, బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షా, ఇంద్రన్స్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

అడవుల్లో ఎర్రచందనం కోసం పనిచేసే కూలీలు, పోలీసుల మధ్య చోటుచేసుకునే పరిణామాలు కథలో ప్రధానంగా ఉండనున్నాయి. ధనుష్ ఇందులో ఎర్ర చందనం కూలీ పాత్రలో కనిపించనున్నారు. పండర్ బార్ ఫిల్మ్స్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయు క్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. తెలుగు రాష్ట్రా ల్లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ విడు దల బాధ్యతలు చేపట్టడంతో సినిమాకు భారీ స్థాయి లో థియేటర్లు ల భించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386, Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.